ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తమిళనాడు
TAMILNADU
ఆదివారం 16 ఫిబ్రవరి 2025



మా కూటమిలో కలహాలు, కలతల్లేవ్

- బీజేపీతో అన్నాడీఎంకే అక్రమ సంబంధం
- 'నాన్న'గా పదోన్నతి పొందడం నా అదృష్టం
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యే
- మహిళాభ్యుదయానికి అధిక ప్రాధాన్యమిస్తా
- 'ఉంగళిల్ ఒరువన్' వీడియోలో సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో కలహాలు, కలతల్లేవని నేతల మధ్య సిద్ధాంతపరంగా అభిప్రాయబేధాలున్నా వాటిపై చర్చించి కూటమి నేతగా తదుపరి చర్యలు తీసుకుంటున్నానని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. 'ఉంగళిల్ ఒరువన్' (మీలో ఒకడిని) పేరుతో విడుదల చేసిన వీడియోలో ఆయన మాట్లాడుతూ.. కూటమి నేతల అభిప్రాయాలను తాను సలహాలుగానే స్వీకరిస్తున్నానని, ఉమ్మడి కుటుంబంలో అభిప్రాయ భేదాలు ఎలా వస్తాయో అలాగే పటిష్ఠమైన డీఎంకే కూటమిలో తరచూ విభిన్న అభిప్రాయాలు తలెత్తటం సాధారణమైన విషయమన్నారు. అదే సమయంలో కూటమినేతగా ఎప్పటికప్పుడు పార్టీ నేతలతో చర్చలు జరుపుతుంటానని చెప్పారు. 2019నుంచి ఇప్పటి వరకు మిత్రపక్షాలన్నీ తనతో సఖ్యంగానే మెలగుతున్నాయని, ఈ మెగాకూటమి వచ్చే శాసనసభ ఎన్నికల్లో కూడా కొనసాగుతుందన్నారు. కూటమిలో అభిప్రాయబేధాలు వచ్చినా తమ బంధం వదిలమని చెప్పారు.

బీజేపీకి 'డబ్బింగ్ వాయిస్' ఈపీఎస్...

ఢిల్లీ అసెంబ్లీ ఫలితాలకు ఇండియా కూటమికి చావుదెబ్బంటూ అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) చేసిన విమర్శపై స్టాలిన్ స్పందిస్తూ రాష్ట్రంలో బీజేపీతో ఈపీఎస్ అక్రమ సంబంధాన్ని ఏర్పరచుకుని బీజేపీ ప్రచార బేరీగా మారిపోయారని ఆరోపించారు. బీజేపీకి 'డబ్బింగ్ వాయిస్' ఈపీఎస్సేనని యెద్దేవా చేశారు. రాష్ట్రంలో లైంగిక వేధింపులపై పోలీసులు వెంటనే నిందితులను అరెస్టు చేసి, వారికి కఠినశిక్షలు పడే విధంగా కేసులు నమోదు చేస్తున్నారని, దోషులు ఎంతటివారైనా ఏ పార్టీకి చెందినవారైనా విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్టాలిన్ స్పష్టం చేశారు. సీఎంగా చాలా బిజీగా ఉండటంతో సామాజిక ప్రసార మాధ్యమాలను ఎక్కువగా చూడడం లేదని, అదే సమయంలో ప్రభుత్వంపై వచ్చే విమర్శలు, ఆరోపణలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. జిల్లాలవారీగా చేస్తున్న క్షేత్ర పరిశీలన పర్యటనలో స్థానికులతో మమేకమవుతూ వారి సమస్యలను ఓపిగా విని పరిష్కరించడం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందని సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు.

'నాన్నా' పిలుపుతో ఫిదా అయిపోయా...

తన సుదీర్ఘ రాజకీయ పయనంలో 'దళపతి', 'తలైవర్', (పార్టీ నేత), 'ముదల్వర్' (ముఖ్యమంత్రి), 'అన్నా' (అన్నయ్యా) అంటూ తనను పిలిచేవారని తొలిసారిగా రాష్ట్రంలోని యువతీయువకులు, చిన్నారులు తనను 'అప్పా' (నాన్నా) అని సంబోధించడానికి ఫిదా అయిపోయానని, ఆ పిలుపు రావటానికి ఎంతో అదృష్టం చేసుకున్నట్టు భావిస్తున్నానని స్టాలిన్ ఉద్వేగంగా పేర్కొన్నారు. కాలగమనంలో ఇతరులు పలు బాధ్యతలు స్వీకరించినా ఇలాంటి పిలుపునకు నోచుకునే ప్రసక్తే ఉండదని, రాష్ట్ర ప్రజలందరినీ తాను తండ్రిలాగే కంటికి రెప్పలా కాపాడుతున్నానని అన్నారు. కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, ఓవైపు రాష్ట్రం అన్ని రంగాల్లో ఇతర రాష్ట్రాలకంటే ముందంజలో ఉందని అధికారిక గణాంకాల ద్వారా ప్రకటిస్తూనే మరో వైపు రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. రాష్ట్ర నిధులతోనే అన్ని పథకాలను అమలు చేస్తున్నామని, రాష్ట్రానికి పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్య నిర్మూలిస్తున్నట్టు వెల్లడించారు. విద్యారంగానికి కూడా కేంద్రం నిధులు ఇవ్వడం మానేసిందని, అయినా తాము ఇతర రాష్ట్రాలన్నీ విస్మయం చెందేలా బడిపిల్లలకు అల్పాహార పథకం, ఇళ్లవద్దకే విద్య, ఎన్నుమ్ ఎళుత్తుమ్ (అంకెలు, అక్షరాలు), 'నాన్ ముదల్వన్', 'పుదుమైపెణ్' 'తమిళ్‌పుదల్వన్' వంటి పథకాలను అమలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రిగా తానెంతో గర్వపడుతున్నానని చెప్పారు.

ద్రావిడ సిద్ధాంతాలను

యువతరానికి బోధించండి

- పిలుపునిచ్చిన డిప్యూటీ సీఎం ఉదయనిధి


పార్టీ ప్రచారకర్తల శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో ఉపముఖ్యమంత్రి

ప్యారీస్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ సిద్ధాంతాలను భావితరాలకు చేర్చాలని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి డీఎంకే యువజన విభాగం కార్యకర్తలకు సూచించారు. తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నాఅరివాలయంలో డీఎంకే యువజన విభాగం తరుఫున యువ ప్రచార కర్తల కోసం శనివారం ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ శిబిరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 180మంది కార్యకర్తలు పాల్గొన్నారు. వారినుద్దేశించి ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఒక్కొక్క జిల్లాలో డీఎంకే తరుఫున ప్రచారకర్తలను తయారుచేయాలన్న సంకల్పంతో గత నెల నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 17వేల మందికి పైగా పాల్గొనగా వారిలో 180మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. సాంకేతికత, పరిజ్ఞానం వేగంగా వృద్ధిచెందుతున్న ఈ రోజుల్లో సామాజిక మాధ్యమాల ద్వారా ద్రావిడ సిద్ధాంతాలను భావితరాలకు చేర్చాలని హితవు పలికారు. అదే విధంగా డీఎంకే ప్రభుత్వ పథకాలను కూడా ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ ప్రచారకర్తలదేనని ఉదయనిధి తెలిపారు.

ఓపీఎస్‌ను

చేర్చుకుంటే మంచిదేమో?



- ఈపీఎస్‌కు నచ్చచెబుతున్న సన్నిహితులు?
- ససేమిరా అంటున్న అన్నాడీఎంకే అధినేత!

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రీటికిమాటికి పార్టీని ఇబ్బంది పెడుతున్న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వంను దరిచేర్చుకుంటే మంచిదని, దీనికోసం ఆలోచించాలని అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామికి సన్నిహితులు నచ్చచెబుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం జరిగిన పరిణామాల్లో బాగంగా పార్టీని చేజిక్కించుకున్న ఈపీఎస్.. అప్పటి వరకూ ప్రధాన కార్యదర్శిగా వున్న వీకే శశికళను, ఆమె సమీప బంధువు టీటీవీ దినకరన్‌ను పార్టీ నుంచి వెళ్లగొట్టిన విషయం తెలిసిందే. అంతేగాక అప్పటికే పార్టీకి దూరమైన ఓపీఎస్‌ను దరి చేర్చుకుని, ఉప ముఖ్యమంత్రి, పార్టీ సమన్వయకర్త పదవులు కూడా ఇచ్చి, శశికళ బృందానికి చెక్ పెట్టారు. అయితే 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం పోయాక ఓపీఎస్-ఈపీఎస్ మధ్య పొరపొచ్చాలు నెలకొన్నాయి. అంతేగాక పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఈపీఎస్ నియామకాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఓపీఎస్.. మళ్లీ పార్టీకి దూరమయ్యారు. ఆ తరువాత ఆయన అనుచరులు పార్టీ కార్యాలయంపై దాడి, పార్టీపై హక్కు కల్పించాలంటూ ఓపీఎస్ న్యాయస్థానాలను ఆశ్రయించారు. అక్కడ ఆయనకు మొండి చెయ్యే దక్కడంతో.. పార్టీ అంతర్గత పరిణామాలపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపేలా ఆదేశించాలని మళ్లీ హైకోర్టుకెక్కారు. అక్కడ పార్టీ పరిణామాలపై విచారణకు ఈసీకి గ్రీన్ సిగ్నల్ రావడంతో.. ఈపీఎస్ బృందం డైలమాలో పడిపోయింది. సుప్రీంకోర్టును ఆశ్రయించినా అక్కడ ఎలాంటి తీర్పు వస్తుందోనని సంశయిస్తోంది.

ఈ నేపథ్యంలో ఓపీఎస్ ఒక మెట్టు దిగి.. తనకెలాంటి పదవులు లేకపోయినా పార్టీ లో చేరేందుకు సిద్ధమని ప్రకటించారు. అంతే కాకుండా గతంలో ఓపీఎస్‌కు సన్నిహితంగా మెలగిన ఈరోడ్ సీనియర్ నేత ఏకే సెంగోట్టయ్యన్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా వుంటున్నారు. ఆయన డీఎంకే దరి చేరుతున్నట్లు తెలుస్తోంది.

దిగిరాని ఈపీఎస్ ...

ఓపీఎస్‌ను పార్టీలో చేర్చుకునేందుకు ఈపీఎస్ ససేమిరా అన్నట్లు తెలిసింది. పార్టీ కార్యాలయంపై దాడి చేయించడం, పార్టీకి నష్టం కలిగించడం వంటి కార్యకలాపాలకు పాల్పడిన ఓపీఎస్‌ను పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని ఈపీఎస్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిజానికి ఇదంతా బీజేపీ ఆడుతున్న నాటకమని, ఆ పార్టీతో పొత్తుకోసం రకరకాలుగా ఒత్తిడి చేయడంలో బాగంగానే తమ పార్టీని ఇబ్బంది పెడుతున్నారని ఈపీఎస్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇప్పుడు తాను తలొగ్గితే, భవిష్యత్తులోనూ దానిని కొనసాగించాల్సివుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఓపీఎస్ చేరికపై ఇప్పుడు అంత తొందరమేందని, ఎన్నికలు సమీపించినప్పుడు తగిన నిర్ణయం ఆలోచిద్దామని ఆయన దాటవేసినట్లు సమాచారం. అయితే పార్టీని కాపాడుకోవడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి వుందని, అందువల్ల సాధ్యమైనంత త్వరగా దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని సన్నిహితులు సూచించారు. గతంలో ఓపీఎస్, వీకే శశికళ, టీటీవీ దినకరన్ తప్ప ఎవరొచ్చినా పార్టీలోకి చేర్చుకుంటామని చెప్పిన ఈపీఎస్.. ఇప్పుడు 'చేరికల విషయంలో మెత్తబడతారా, లేక తన నిర్ణయానికే కట్టుబడతారా అన్నది వేచి చూడాల్సివుంది.

ఈపీఎస్‌కు నచ్చచెబుతున్న నేతలు!

ఓపీఎస్ మెట్టు దిగి వచ్చినందున ఆయన్ని పార్టీలో చేర్చుకుంటే మంచిదని ఈపీఎస్‌కు సన్నిహితులు నచ్చచెబుతున్నట్లు తెలిసింది. మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు వున్నందున.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు జరుగుతుంటే అధికార పార్టీని ఢీకొట్టలేమని, అందువల్ల వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలని వారు సూచించినట్లు సమాచారం. సెంగోట్టయ్యన్‌తో మరో ఐదారుగురు నేతలు కూడా జత కట్టినట్లు వార్తలు వెలువడుతున్నందున.. ఓపీఎస్‌ని దరి చేర్చుకుని, ఆయన ద్వారా సెంగోట్టయ్యన్ బృందాన్ని శాంతింపజేయాలని వారు సలహా ఇచ్చారు.

25నుంచి అన్నాడీఎంకే బహిరంగ సభలు: ఈపీఎస్

ప్యారీస్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతిని పురస్కరించుకుని అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఈ నెల 25 నుండి మార్చి 1వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో 24న దివంగత మాజీముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతిని అన్ని జిల్లాల్లో నిర్వహించి పేదలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శులు, నాయకులకు ఆదేశించారు. అదేవిధంగా ఈ నెల 25 నుండి మార్చి 1 వరకు 234 శాసనసభ నియోజకవర్గాలు, పార్టీ అనుబంధ శాఖలున్న ఇతర రాష్ట్రాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తేనిజిల్లా పెరియకుళం నియోజకవర్గంలో మార్చి 1న నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నట్లు ఈపీఎస్ తన ప్రకటనలో తెలిపారు.

టెన్త్, ప్లస్ టూ

సీబీఎస్ఈ పరీక్షలు ప్రారంభం



విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయిని - దైవ ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోనూ ఈ పరీక్షలు ప్రారంభం కాగా, 1.4 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. తొలిరోజు టెన్త్ విద్యార్థులకు ఆంగ్లం, ప్లస్ టూ విద్యార్థులకు పారిశ్రామిక శాస్త్రం పరీక్షలు జరిగాయి. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పలు నిబంధనలు విధించారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలపై నిషేదం విధించారు. అలాగే, విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. తొలిరోజు ఆంగ్లం పరీక్ష ప్రశ్నపత్రం సులభంగా ఉందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల కానున్నాయి.


రాజీవ్‌గాంధీ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో రూ.42లక్షలతో సమకూర్చిన రేడియో ఫ్రీక్వెన్సీ పరికరాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి ఎస్ఎస్ సుందర్, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం

డీఎంకే ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- బౌండరీలతో హోరెత్తించిన ఎంపీ అరుణ్ నెహ్రూ

ప్యారీస్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ 72వ జన్మదినాన్ని పురస్కరించుకుని డీఎంకే క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెండు రోజుల క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. మొత్తం 8 ఓవర్లుగా నిర్ణయించిన ఈ పోటీల్లో 22 జట్లు సత్తా చాటనున్నాయి. ట్రిప్లికేన్ నియోజకవర్గం చేపాక్ గ్రౌండులో జరిగిన తొలిరోజు పోటీలో మంత్రులు, ఎమ్మెల్యేల జట్టుకు ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం కెప్టెన్‌గా, పాఠశాల విద్యాశాఖా మంత్రి అన్బిల్ మహేష్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించారు. తొలిరౌండులో మంత్రులు, ఎమ్మెల్యేల జట్టుతో సచివాలయ జట్టు పోటీపడింది. ఈ జట్టు కెప్టెన్‌గా పూచ్చి మురుగన్ వ్యవహరించారు. టాస్ గెలిచిన సచివాలయం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ముందుగా డీఎంకే ఎంపీ అరుణ్ నెహ్రూ, విజయ్ బ్యాటింగ్ చేశారు. వీరిలో అరుణ్ నెహ్రూ బౌండరీలతో స్కోరు బోర్డు పరిగెత్తించారు. ఈ జట్టు 118 పరుగులు సాధించింది. ఆ తర్వాత బరిలోకి దిగిన ఎమ్మెల్యేల జట్టు తరుఫున మంత్రి అన్బిల్ మహేష్ బ్యాటింగ్ చేశారు. తర్వాత ఎమ్మెల్యేలు తాయగంకవి, జోసఫ్ సామ్యేల్ బ్యాటింగ్ చేశారు. ఈ జట్టు 8 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 53 రన్స్ చేసింది. రాత్రి 7 గంటలకు జరిగే బహుమతుల ప్రదానోత్సవంలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి రన్నర్, విన్నర్ జట్లకు ట్రోఫీ, జ్ఞాపికలు బహూకరించారు. ఆదివారం సాయంత్రం డే అండ్ నైట్ మ్యాచ్‌కు భారీ ఏర్పాట్లు చేశారు.



మంత్రుల జట్టు - ట్రోఫీతో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి

వరి క్వింటాల్‌కు రూ.3,100

● చెరకుకు రూ.4,400

- ● 58 ఏళ్లు నిండిన రైతులకు నెలకు రూ.3 వేల ప్రోత్సాహకం
- ● రైతు మరణిస్తే పరిహారం ఇచ్చేలా ఇన్స్యూరెన్స్
- ● వ్యవసాయ బడ్జెట్‌పై అభిప్రాయ సేకరణలో రైతుల విజ్ఞప్తి


రైతులతో మాట్లాడుతున్న మంత్రి పన్నీర్‌సెల్వం

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్‌కు సంబంధించి తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై, కడలూరు, అరియలూరు, పెరంబలూరు, తిరుచ్చి జిల్లాల రైతుల అభిప్రాయ సేకరణ సమావేశం శుక్రవారం కుంభకోణంలో జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం అధ్యక్షత వహించగా, కలెక్టర్ పి.ప్రియాంక పంకజం ఆహ్వానం పలికారు. సమావేశంలో రైతులు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వరి క్వింటాలుకు రూ.3,100, చెరకుకు రూ.4,400 అందిస్తున్నారని, తెలంగాణా, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వరి, చెరకు, పత్తి, చిరుధాన్యాల ఉత్పత్తికి ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సబ్సిడీగా ఇస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అలాగే అందించాలని విజ్ఞప్తి చేశారు.

రైతు జీవిత బీమా: సాగుపనుల్లో రైతు మృతిచెందితే రూ.20 లక్షలు, శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించేలా ముఖ్యమంత్రి రైతు జీవిత బీమా పథకం ప్రవేశపెట్టాలని, ఇందుకోసం రైతుల నుంచి ప్రీమియంగా రూ.50 వసూలు చేయవచ్చన్నారు. 58 ఏళ్లు నిండిన స్త్రీ, పురుష రైతులు, వ్యవసాయ కార్మికులకు ప్రతి నెలా రూ.3 వేలు సాయం అందించాలన్నారు. పేరావూరణి, పట్టుకోట పారంతాల్లో కొబ్బరి అభివృద్ధి మండలి శాఖ కార్యాలయాల ఏర్పాటు, కావేరి, కొల్లిడం ప్రాంతాలన్నింటినీ రక్షిత తాగునీటి జోన్‌లుగా ప్రకటించి భూగర్భ జలాలను కాపాడాలని, నదుల్లో ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతించకూడదని రైతులు విజ్ఞప్తి చేశారు.

నాలుగేళ్లలో రూ.5,643 కోట్ల నిధులు

సమావేశంలో మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ... గత నాలుగేళ్లలో 24 అభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించామన్నారు. 1,860 మంది రైతులు పాల్గొని, 1,267 అభిప్రాయాలు తెలియజేశారని, వాటిలో 719 అంశాలను ప్రాజెక్టులుగా నెరవేర్చామని తెలిపారు. నాలుగేళ్లలో పంట బీమా పథకంలో 30 లక్షల మంది రైతులకు రూ.5,242 కోట్లు, కరువు నివారణగా 14 లక్షల మంది రైతులకు రూ.126 కోట్లు, వరి వంగడాల పథకంలో 12 లక్షల మంది రైతులకు రూ.274 కోట్లు మొత్తం 56 లక్షల మంది రైతులకు రూ.5,643 కోట్లు అందజేసినట్లు తెలిపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రైతులు తెలియజేసిన అభిప్రాయాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఒక్కో పథకం అమలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రైవేటు పరం చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రంలో అమలుచేయమని తెలిపారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలు పెంచినట్లు మంత్రి తెలిపారు.

సమాచార దర్శిని

ఏప్రిల్ 5,6 తేదీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి రాతపరీక్ష

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు ఏప్రిల్ 5,6 తేదీల్లో రాతపరీక్ష నిర్వహించనున్నారు. ఈ విషయమై టీచర్ సెలక్షన్ బోర్డు సెక్రటరీ విడుదల చేసిన ప్రకటనలో.. అన్నా వర్సిటీలోని ఇంజనీరింగ్ కోర్సుల్లో 232 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. ఈ పరీక్షలు ఏప్రిల్ 5,6 తేదీల్లో నిర్వహించనున్నట్లు వర్సిటీ శనివారం ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారం ముందుగా http://www.trb.tn.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సెక్రటరీ తెలిపారు.

19 నుంచి టీఎన్‌పీఎస్సీ ఇంటర్వ్యూలు

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో అకౌంట్స్ ఆఫీసర్, లీగల్ ఆఫీసర్ సహా వివిధ ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 19వ నుంచి ఇంటర్వ్యూలు జరుగనున్నాయి. ఈ మేరకు టీఎన్‌పీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలో.. బ్రాడ్వే సమీపంలో టీఎన్‌పీఎస్సీ ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగనున్నాయి. అభ్యర్థుల ర్యాంక్ జాబితా టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో ఇటీవల ప్రచురించారు. అభ్యర్థులు ఇంటర్వ్యూ తేది, సమయం, ఇతర వివరాలతో కూడిన కాల్ లెటర్ టీటీఎన్‌పీఎస్సీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

నగరానికి చేరుకున్న డ్రైవర్ రహిత రెండో మెట్రోరైలు

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండవ విడత మెట్రోరైలు ప్రాజెక్ట్‌లో మూడు మార్గాల్లో మొత్తం 138 డ్రైవర్ రహిత మెట్రోరైళ్లు నడపాలని మెట్రోరైలు సంస్థ నిర్ణయించింది. ఆ ప్రకారం, డ్రైవర్ రహిత తొలి మెట్రోరైలు ఆంధ్ర రాష్ట్రం శ్రీసిటీలో తయారై, కొద్ది నెలల క్రితం నగరానికి చేరుకుంది. ఈ విషయమై మెట్రో సంస్థ అధికారులు మాట్లాడుతూ.. డ్రైవర్ రహిత తొలి మెట్రోరైలును పూందమల్లి డిపో, కోయంబేడు డిపోల్లో కొద్ది దూరం ప్రయోగాత్మకంగా నడిపామని, త్వరలో వేగం పెంచి ట్రయల్ రన్ నిర్వహించనున్నామన్నారు. అలాగే, శ్రీ సిటీ నుంచి డ్రైవర్ రహిత రెండో మెట్రోరైలు నగరానికి చేరుకుందని వారు తెలిపారు.

జీసీసీ పరిధిలో రూ.2,131 కోట్ల పన్ను వసూలు

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో ఇప్పటివరకు రూ.2,131 కోట్ల పన్నులు వసూలయ్యాయి. ఇది, గత ఏడాదితో పోల్చితే రూ.378.73 కోట్లు అధికం. జీసీసీకి ఆస్తి, వృత్తి పన్ను ప్రధాన ఆదాయవనరులు. అలాగే, కార్పొరేట్ పన్ను, వినోద పన్ను, వ్యాపార లైసెన్స్, దుకాణాల అద్దె, వ్యాపార ప్రకటన బోర్డులు తదితరాల ద్వారా, జీసీసీకి ఏడాదికి రూ.2,500 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా నెలన్నర వ్యవధి ఉండగా, పన్ను వసూళ్లపై జీసీసీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు ఆస్తి పన్ను రూ.1,708 కోట్లు, వృత్తి పన్ను రూ.315 కోట్లు మొత్తం రూ.2131.11 కోట్లు వసూలైంది. పన్ను చెల్లింపుకు ఇంకా వ్యవధి ఉండడంతో రూ.2,500 కోట్ల లక్ష్యం అధికమించే అవకాశముందని అధికారులు తెలిపారు.

అగ్నిమాపక శాఖకు 'డ్రోన్'

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల ప్రభావం తెలుసుకొనేందుకు 'డ్రోన్' వినియోగించాలని అగ్నిమాపక శాఖ నిర్ణయించింది. అగ్నిప్రమాదాల సమయంలో అవసరమయ్యే నివారణ, రక్షణ పరికరాలను ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అలాగే, మదురై సహా ప్రముఖ నగరాల్లో రక్షణ కోసం శునకాలను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రమాదాలు అధికంగా సంభవించే శివకాశి ప్రాంతంలోని బాణాసంచా దుకాణాల్లో మంటలు చెలరేగిన సమయంలో, అగ్నిమాపక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఈ జాప్యం నివారించేలా 'డ్రోన్' వినియోగించాలని నిర్ణయించారు. మంటలు విస్తరణ, శిథిలమైన కట్టడాలు, కట్టడాల్లో చిక్కుకున్న వారు తదితరాలు తెలుసుకొనేలా డ్రోన్ వినియోగించనున్నట్లు, అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అగ్నిమాపక కేంద్రాలకు డ్రోన్లు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు గుమ్మిడిపూండి సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చెన్నై-గుమ్మిడిపూండి మార్గంలో ఆదివారం 25 సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. పొన్నేరి-కవరపేట రైల్వేస్టేషన్ల మధ్య మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చెన్నై-గుమ్మిడిపూండి మధ్య 25 సబర్బన్ రైళ్లు రద్దు చేశారు. అదే సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్-పొన్నేరి మధ్య 10 ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడువనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

అస్తి పన్ను చెల్లించేవారు మొబైల్ నెంబరు నమోదుచేయాలి

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో ఆస్తి పన్ను చెల్లించే యజమానులు వారి మొబైల్ నెంబర్లు జీసీసీ వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని అధికారులు సూచించారు. ఈ మేరకు జీసీసీ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... ఆస్తి పన్ను చెల్లింపునకు సంబంధించిన వివరాలు యజమానులకు మొబైల్ నెంబర్ల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. అందువల్ల ఆస్తుల యజమానులు తమ మొబైల్ నెంబర్లు www.chennaicorporation.gov.in'Gu\ అనే వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని జీసీసీ సూచించింది.

'కాశీ తమిళ సంగమం అనుభవాలు' వ్యాసరచన పోటీలు

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న కాశీ తమిళ సంగమం కార్యక్రమాల్లో రాష్ట్రం నుంచి పాల్గొంటున్న ప్రతినిధుల అనుభవాలపై రాజ్‌భవన్ వ్యాసరచన పోటీలు నిర్వహించనుంది. ఈ మేరకు రాజ్‌భవన్ విడుదల చేసిన ప్రకటనలో... కాశీ తమిళ సంగమం వారణాసిలో ఈ నెల 15 నుంచి 24వ తేది వరకు జరుగుతుండగా, రాష్ట్ర తరఫున 1080 మంది ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపింది. కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ అనుభవాలను వెయ్యి వ్యాక్యాలకు మించకుండా రాసి 'గవర్నర్ డిప్యూటీ సెక్రటరీ (విశ్వవిద్యాలయాలు), గవర్నర్ కార్యాలయం, రాజ్ భవన్, చెన్నై-600022' అనే చిరునామాకు మార్చి 14వ తేది లోపు పంపించాలి. ఉత్తమ రచనకు మొదటి బహుమతిగా రూ.10,000, రెండవ బహుమతిగా రూ.7,000, మూడవ బహుమతిగా రూ.5,000 నగదు బహుమతి అందజేయనున్నట్లు రాజ్‌భవన్ తెలిపింది.

పాఠశాలల ప్రవేశద్వారంలో కులం పేర్లు

● ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రవేశద్వారంలో కులం పేర్లు ఉండడంపై, రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటని మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. దక్షిణ భారత సెంగుంతర్ మహాజన సంఘం దాఖలుచేసిన పిటిషన్‌ను విచారించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి భరత్ చక్రవర్తి రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. కులాలు లేవని చెప్పి పాఠశాలల ప్రవేశ ద్వారం వద్ద కులం పేరు రాయగలమా? కులరహిత సమాజాన్నస్థించాలని రాజ్యాంగం చెబుతోందన్నారు. కులాన్ని శాశ్వతం చేయాలనే ఉద్దేశంతో కులం పేరుతో సంఘాన్ని ప్రారంభించవచ్చా? ఈ విషయంలో సంఘం ప్రారంభించడం సరైనదేనా? సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టాల ప్రకారం కులం పేరుతో సొసైటీలను ప్రారంభించవచ్చా? పాఠశాలలు, కళాశాలలువంటి విద్యా సంస్థలు కూడా ఇటువంటి కుల సంఘాలచే నిర్వహించబడుతున్నాయి. పాఠశాల ప్రవేశద్వారం వద్ద కులంపేరు ఉండడానికి సంబంధించి ప్రభుత్వ వైఖరి ఏమిటి? ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19వ తేదీలోపు అఫిడవిట్ దాఖలుచేయాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

జైన మందిరంలో భారీ చోరీ


దోపిడీకి గురైన జైనదేవాలయం

టినగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సావుకారుపేటలో జైన దేవాలయంలో గుర్తు తెలియని దుండగులు 500 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి దోచుకెళ్లారు. సావుకారుపేట మింట్ వీధిలో జైన మందిరానికి నగరానికి చెందిన జైన మతస్థులంతా వెళ్లి పూజలు నిర్వహిస్తుంటారు. ఆ ఆలయానికి దిలీప్ అనే వ్యక్తి పూజారిగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం దిలీప్ ఆలయాన్ని తెరిచేందుకు రాగా తలుపులకు వేసిన తాళం పగులగొట్టి ఉండటం గమనించి దిగ్భ్రాంతి చెందారు. ఆ తర్వాత గర్భాలయంలో ఐదు విగ్రహాలకు అలంకరించిన 500 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. అదేవిధంగా రెండు కేజీల బరువుండే ఐదు వెండి కిరీటాలు, ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎలిఫెంట్ గేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ ఆలయం వద్దనున్న సీసీ ఫుటేజీ పరిశీలించారు. 12 అడుగుల ఎత్తైన ప్రహరీ దూకి దుండగులు బంగారు, వెండి ఆభరణాలను మూటకట్టుకుని బయటికి వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. ఈ దోపిడీకి సంబంధించి దేవాలయం వద్ద రోజూరాత్రిపూట పడుకునే రాజస్థాన్‌కుచెందిన ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

అన్నా వర్సిటీ మాజీ వీసీ వాసగం మృతి



చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ఛాన్సలర్ వాసగం(91) వృద్ధాప్యసమస్యలు, అనారోగ్యంతో కన్నుమూశారు. 1996 నుంచి 1999 వరకు ఆయన వీసీగా సేవలందించారు. రాష్ట్ర సాంకేతిక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ఇస్రో సైంటిస్ట్‌గాను ఆయన పనిచేశారు. తిరువనంతపురంలోని తుంబా విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రం డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వం వాసగం సేవలను గుర్తించి పద్మశ్రీ బిరుదుతో ఆయనను సత్కరించింది. భాస్కర ఉపగ్రహ తయారీ ప్రాజెక్టు డైరెక్టర్‌గాను ఆయన పనిచేశారు. గత కొద్ది నెలలుగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బెంగుళూరులోని నివాసగృహంలో ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు.

అక్రమ సారా వ్యవహారం....

విద్యార్థి సహా ఇద్దరి దారుణహత్య

● సారా వ్యాపారి సహా ముగ్గురి అరెస్టు


హత్యకు గురైన హరిశక్తి, హరీష్ (ఫైల్‌ఫొటోలు)

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై వద్ద సారా వ్యాపారం గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారనే కారణంగా కాలేజీ విద్యార్థి సహా ఇద్దరు దారుణహత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించి సారా వ్యాపారి సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా... మైలాడుదురై జిల్లా పెరంబూరు పోలీసు సర్కిల్‌లోని ముట్టమ్ ఉత్తవీధికి చెందిన రాజ్‌కుమార్ అనే సారావ్యాపారి నివసిస్తున్నాడు. అక్రమ మద్యం కేసుల్లో ఎక్సైజ్ పోలీసులు ఆయనను పలుమార్లు అరెస్టు చేశారు. జైలు నుంచి ఇటీవలే బెయిలుపై విడుదలయ్యాడు. తన అక్రమ సారా వ్యాపారం గురించి అదే ప్రాంతానికి చెందిన హరీష్ (25) పోలీసులకు సమాచారం అందించాడని అనుమానించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి హరీష్ తన స్నేహితుడు ఇంజనీరింగ్ విద్యార్థి హరిశక్తి (22) తో కలిసి ఉత్తర వీధిలో మాట్లాడుతుండగా అక్కడికొచ్చిన రాజ్‌కుమార్, అతడి బావమరుదులు మూవేందన్, తంగదురై వారిని చుట్టుముట్టి వేటకొడవళ్లతో దాడి చేసి పారిపోయారు. హరీష్ సంఘటనా స్థలంలోనే మరణించగా, హరిశక్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ విషయం తెలిసి ఆగ్రహం చెందిన మృతుల బంధువులు రాజ్‌కుమార్ ఇంటి ముందున్న కొట్టానుకు నిప్పంటించారు. మూవేందన్ ఇంటిలో వస్తువులను లూటీ చేశారు. ఈ సమాచారం అందుకుని పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని శనివారం ఉదయం రాజ్‌కుమార్, మూవేందన్, తంగదురైని అరెస్టు చేశారు.


సారావ్యాపారి రాజ్‌కుమార్, మూవేందన్, తంగదురై

ఎన్నికల హామీ నెరవేర్చండి

● ప్రభుత్వానికి సీపీఎం సూచన


సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకటైన పాత పింఛన్ విధానం సత్వరం అమలుచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం సూచించారు. రామనాథపురంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సంపూర్ణ మద్యనిషేధం మా అజెండా కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా మద్యం దుకాణాలను తగ్గిస్తుందని, అదే సమయంలో ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు, విద్యా సంస్థల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలు మూసివేయాలన్నారు. రాష్ట్ర జాలర్ల అరెస్ట్ దైనందిన చర్యల్లో ఒకటిగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తమిళ జాలర్లు అని చూడకుండా భారత జాలర్లు అని భావించి, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా పాత పింఛన్ విధానం వెంటనే అమలుచేయాలని, పింఛన్ పథకాల అమలుకు నియమించిన కమిటీని వెంటనే రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానం అమలుచేయని పక్షంలో, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీచే అవకాశముందని షణ్ముగం అభిప్రాయం వ్యక్తం చేశారు.

మద్యం అక్రమ రవాణాకు అడ్డదారులు


శరీరంపై మద్యం బాటిళ్లు ఉంచిన నాగమణి

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): పుదుచ్చేరి నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. విల్లుపురం ప్రత్యేక విభాగం ఎస్‌ఐలు షణ్ముగం, సతీష్ నేతృత్వంలో పోలీసులు శనివారం విల్లుపురం బస్టాండ్‌లో నిఘాపెట్టారు. ఆ సమయంలో సందేహాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతను పొంతన లేని సమాధానాలిచ్చాడు. అతడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా నూతన పద్ధతిలో మద్యం బాటిళ్లు తరలిస్తున్నట్లు గుర్తించారు. శరీరం మొత్తం మద్యం బాటిళ్లను ప్లాస్టిక్ టేపుతో అతికించి, వాటిపై బట్టలు వేసుకున్నట్లు గుర్తించారు. అతను విల్లుపురం జీఆర్పీ వీధికి చెందిన నాగమణి (40)గా గుర్తించిన పోలీసులు, అతని నుంచి 90 మి.లీ కలిగిన 100 బాటిళ్లు, 150 మి.లీ కలిగిన 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

బేకరి ముందు ధర్నా.. ఐదుగురి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): శివగంగా జిల్లా కారైకుడిలో వాలెంటైన్స్ డే సందర్భంగా డిస్కౌంట్ ప్రకటించిన ఓ బేకరీ ముందు ధర్నాకు దిగిన హిందూ మున్నణికి చెందిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కారైకుడిలో ఓ బేకరి యాజమాన్యం వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేమ జంటలకు ప్రత్యేక రాయితీ కల్పించి బహుమతులు ఇస్తున్నట్లు ప్రకటించింది. దీనిని అభ్యంతరం తెలిపిన హిందూ మున్నణి జిల్లా కార్యదర్శి అగ్నిబాలా నేతృత్వంలో బేకరీ ముందు ఆ సంస్థకు చెందిన ఐదుగురు మంగళసూత్రంతో నిలబడి నినాదాలు చేశారు. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళనాకారులను అరెస్టు చేసి దేవకోట మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచి కోర్టు ఉత్తర్వుల మేరకు తిరుపత్తూరు సబ్‌జైలుకు తరలించారు.

పంపుసెట్ల చోరీ: యువకుడి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ ఏఎఫ్ బ్లాక్‌లో పంపుసెట్లను చోరీ చేసిన ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే అన్నానగర్ ఏఎఫ్ బ్లాక్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ వివేకానందం నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఆ బ్లాక్‌లో ఎవరో నడుస్తున్నట్లు శబ్దం వినిపించడంతో వెంటనే వివేకానందం బయటకు రావడంతో గమనించిన ఆ వ్యక్తి గోడ దూకి పారిపోయినట్లు తెలిసింది. దీనిపై వివేకానందం అందజేసిన ఫిర్యాదుపై తిరుమంగళం నేరవిభాగం ఇన్‌స్పెక్టర్ రత్నకుమార్ అన్నానగర్ ఏఎఫ్ బ్లాక్‌లో సీసీ పుటేజీ పరిశీలించి, విల్లివాక్కం ప్రాంతానికి చెందిన దీపక్ (24) అనే యువకుడిని అరెస్ట్ చేశారు.

పారిశుధ్య కార్మికురాలి నిజాయితీ

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన 5 సవర్ల బంగారం చైన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన పారిశుధ్య కార్మికురాలిని పోలీసు అధికారులు అభినందించారు. నామక్కల్ జిల్లా రాశిపురం సమీపం వెన్నానతూర్ ప్రాంతానికి చెందిన సంగీత, తన బంధువు శశికళకు ఇచ్చిన 5 సవర్ల చైన్ తిరిగి తీసుకొని, బ్యాగులో పెట్టుకుని ఇంటికి బయల్దేరింది. ఇంటికి వచ్చిన తరువాత బ్యాగు కనిపించకపోవడంతో వెన్నానతూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో, పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న రాధామణికి రోడ్డు పక్కన పడిన బ్యాగు తీసుకొని చూడగా, అందులో బంగారు చైన్ ఉండడంతో వెన్నానతూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించింది. దీనిపై రాశిపురం డీఎస్పీ విజయకుమార్, ఎస్‌ఐ సుబ్బవణం విచారణ చేసి సంగీతను పిలిపించి నగ అందజేశారు. అలాగే, నిజాయితీగా వ్యవహించిన రాధామణిని అభినందించిన డీఎస్పీ, ఆమెకు ప్రోత్సాహక నగదు అందజేశారు.



పోలీసుల సమక్షంలో చైన్ అందజేస్తున్న కార్మికురాలు రాధామణి

కారు బోల్తా.. ఇద్దరి మృతి

● ముగ్గురికి గాయాలు

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వెప్పూర్ సమీపంలో అదుపుతప్పిన కారు రోడ్డు పక్కన పల్లపు ప్రాంతంలో పడి ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు, చెన్నై పాడి ప్రాంతానికి చెందిన శబరినాథ్ (36), పల్లికరనైకు చెందిన ప్రభాకరన్ (36) సహా ఐదుగురు కారులో మురుగన్ ఆలయానికి బయల్దేరారు. కడలూరు జిల్లా వెప్పూర్ సమీపం చేపాక్కం ప్రాంతంలో వస్తున్న కారు హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పల్లపు ప్రాంతంలో బోల్తాపడింది. ఈ ఘటనలో శబరినాథ్, ప్రభాకరన్ మృతిచెందారు. సమాచారం అందుకున్న వెప్పూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను విరుదాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిద్ర మత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కొడైకెనాల్ జెరోనియం అడవుల్లో కార్చిచ్చు



పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్ కొండల్లో కార్చిచ్చు ఏర్పడింది. కొడైకెనాల్ పెరుంపల్లం అటవీ రేంజ్ పరిధిలోని జెరోనియం కొండ ప్రాంతంలో శుక్రవారం మంటలు చెలరేగాయి. ఈ సమయంలో గాలి వేగం అధికంగా ఉండడంతో మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించాయి. ఈ మంటల్లో చెట్లు, ఔషధ మొక్కలు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఈ మంటలు అదుపుచేసేందుకు సుమారు 50 మందికి పైగా అటవీ, అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్నారు. ఆదివారంలోగా మంటలు అదుపులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

ప్రభాకరన్ ఫొటో వాడేందుకు సీమాన్‌కు అర్హత లేదు

● హైకోర్టులో పిటిషన్

టినగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ఉగ్రవాద సంస్థ ఎల్టీటీఈ నేత ప్రభాకరన్ ఫొటోను నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకె) నేత సీమాన్ ఉపయోగించకుండా స్టే విధించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. 15సంవత్సరాలకు ముందు శ్రీలంకలోని జాఫ్నాకు వెళ్ళి ప్రభాకరన్‌ను కలుసుకున్నానని, ఆయన వద్ద ఫైరింగ్ కూడా నేర్చుకున్నానని సీమాన్ చెబుతున్నారు. అంతటితో ఆగకుండా ప్రభాకరన్‌తో తీసుకున్న ఫొటోలని తరచూ పార్టీ పోస్టర్లలో వాటిని ముద్రిస్తున్నారు. ఇటీవల ప్రముఖ తమిళ సినీ దర్శకుడు శంగగిరి రాజ్‌కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ సీమాన్ ప్రభాకరన్‌ను కలుసుకోలేదని తెలిపారు. ప్రభాకరన్‌తో సీమాన్ ఉన్నట్లుగా తానే మార్ఫింగ్ ఫొటోలు తయారు చేసి ఆయనకు ఇచ్చానని వెల్లడించారు. ప్రభాకరన్‌తో తానున్న ఫొటో నకిలీదని చెప్పటానికి ఆధారాలు ఉన్నాయా అంటూ సీమాన్ రాజ్‌కుమార్‌పై మండిపడ్డారు. ఆ నకిలీ ఫొటో చేసింది తానే కనుక ఆధారాలు చూపమని అడగటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ పరిస్థితులలో చార్లెస్ అలెగ్జాండర్ అనే సీనియర్ న్యాయవాది హైకోర్టులో ఓ పిటిషన్ వేశారు. సీమాన్ రాజకీయ లబ్ధి కోసం ప్రభాకరన్‌తో ఉన్న ఫొటోలను వాడుతున్నారని ఆరోపించారు. సీమాన్ ఇకపై ప్రభాకరన్‌తో కలిసి తీసుకున్నట్లు చెబుతున్న ఫొటోలను ఎక్కడా వాడకుండా స్టే ఇవ్వాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై త్వరలో విచారణకు రానుంది.

నగల తయారీ కేంద్రంలో భారీ చోరీ

● పరారైన ఉత్తరాది యువకుడి కోసం గాలింపు

ప్యారీస్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓటేరిలో పడవట్టమ్మల్ ఆలయ వీధిలోని ఓ నగల తయారీ కేంద్రంలో పనిచేస్తూ వంద సవర్ల నగలు దోచుకుని పరారైన ఉత్తరాది యువకుడి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఓటేరికి చెందిన షేక్ షమీమ్ అలీ నడుపుతున్న నగల తయారీ కేంద్రంలో వంద మందికి పైగా స్వర్ణకారులు పనిచేస్తున్నారు. నగరంలో ఉన్న జ్యూవెలరీ షాపుల నుంచి వచ్చే ఆర్డర్‌తో నగలు తయారు చేసి సరఫరా చేస్తుంటారు. ఈ కేంద్రంలో పనిచేస్తున్న ఉత్తరాది కార్మికులు అక్కడ తయారయ్యే నగలను ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి పాలిష్ చేసిన తర్వాత జ్యూవెలరీ షాపులకు సరఫరా చేస్తుంటారు. ఇందులో భాగంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన అబ్దుల్ రసీమ్ శుక్రవారం పాలిష్ చేసిన సుమారు వంద సవర్ల నగలను దుకాణాల్లో అప్పగించేందుకు తీసుకువెళ్లాడు. పని పూర్తయిన తరువాత రాత్రి 8.30 గంటల్లోపు తిరిగి నగల తయారీ కేంద్రానికి రావాల్సివుంది. అర్ధరాత్రి వరకు అతడి కోసం ఎదురుచూసిన యజమాని షేక్ షమీమ్ అలీ అతడికి ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఓటేరి పోలీసులు నగలతో పరారైన అబ్దుల్ రసీమ్ కోసం గాలిస్తున్నారు.

టాస్మాక్ దుకాణానికి నిరసనగా ధర్నా

● జాఫర్‌ఖాన్‌పేటలో కలకలం

ప్యారీస్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంజీఆర్‌నగర్ జాఫర్‌ఖాన్‌పేటలో కొత్తగా టాస్మాక్ మద్యం దుకాణం ప్రారంభించడాన్ని ఖండిస్తూ స్థానికులు శనివారం ధర్నాకు దిగారు. సుమారు 500మందికి పైగా ఈ ఆందోళనలో పాల్గొనడంతో ఆ ప్రాంతంలో కలకలం చోటుచేసుకుంది. జాఫర్‌ఖాన్‌పేట పచ్చయప్పన్‌వీధిలో పాఠశాలలు, ఆలయాలున్న ప్రాంతంలో కొత్తగా టాస్మాక్ మద్యం దుకాణాన్ని ప్రారంభించేందుకు అధికారులు గత 8ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారు. ఇందుకు అభ్యంతరం తెలిపిన స్థానికులకు మద్దతుగా పలు స్వచ్ఛంద సంస్థలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిపక్షాలు ఆ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ టాస్మాక్ సంస్థకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించాయి. విమర్శలకు దారితీసిన ప్రాంతంలో టాస్మాక్ దుకాణం ఏర్పాటు చేసేందుకు అధికారులు శనివారం ఉదయం జాఫర్‌ఖాన్‌పేట వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, రాజకీయపార్టీల నాయకులు సుమారు 500మందికి పైగా టాస్మాక్ అధికారుల చర్యలు ఖండిస్తూ ధర్నాలో పాల్గొన్నారు. భారతీయ మహిళను

తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

● మద్రాసు హైకోర్టు ఆదేశం

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తొలగించిన భారతీయ మహిళను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని చెన్నైలోని శ్రీలంక దౌత్యకార్యాలయాన్ని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. చెన్నైలోని శ్రీలంక దౌత్య కార్యాలయంలో 2008 నుంచి అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సెంథిల్‌కుమారిని 2018లో తొలగించారు. తనకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలంటూ సెంథిల్ కుమారి కార్మిక సంక్షేమ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు.. పిటిషనర్ కాంట్రాక్ట్ కార్మికుడు అంటూ ట్రిబ్యునల్ పిటిషన్ తిరస్కరించింది. దీనిని సవాలు చేస్తూ సెంథిల్ కుమారి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి భరత్ చక్రవర్తి.. రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లో పనిచేసే భారతీయులకు దేశంలో సామాజిక భద్రతా చట్టాలు వర్తిస్తాయంటూ, భారతీయ మహిళను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని చెన్నైలోని శ్రీలంక కాన్సులేట్‌ను ఆదేశించింది.

టేకాఫ్‌లో శ్రీలంక విమానంలో సాంకేతిక లోపం

● 176 మందికి తప్పిన ముప్పు

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మీనాంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం ఉదయం బయలుదేరిన శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపం ఏర్పడింది. టేకాఫ్ అవుతున్న సమయంలో పైలెట్ ఆ లోపాన్ని గుర్తించడంతో 168 ప్రయాణికులు 8 మంది సిబ్బంది సహా 176 మందికి ప్రమాదం తప్పింది. ఉదయం 9.40 గంటలకు ఆ విమానం రన్‌వేపై టేకాఫ్ చేస్తుండగా పైలెట్ సాంకేతిక లోపాన్ని గమనించి వెంటనే దానిని నిలిపివేశారు. ఆ తర్వాత విమానంలోని ప్రయాణికులందరిని కిందకు దింపేశారు. సాంకేతిక నిపుణులను పిలిపించి ఆ విమానంలో ఏర్పడిన లోపాన్ని చక్కదిద్దటానికి ప్రయత్నించారు.

భాగ్యనగరానికి భాగ్యం?



ఐశ్వర్య రాజేష్

సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన తెలుగు చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో భాగ్యం పాత్రలో జీవించి అందరి ప్రశంసలు అందుకున్న కోలీవుడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ హైదరాబాద్‌కు మకాం మార్చనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'సంక్రాంతికి వస్తున్నాం' విజయంతో ఆమెకు తెలుగులో వరుస అవకాశాలు వస్తున్నాయి. ఈ కారణంగానే ఆమె హైదరాబాద్‌కు మకాం మార్చనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కోలీవుడ్‌లో వరుస చిత్రాల్లో నటిస్తున్న ఐశ్వర్యకు తెలుగులో కూడా మంచి పాత్రలే వస్తున్నాయి. పైగా ఆమె గతంలో నటించిన లేడీ ఓరియంటెడ్ చిత్రాలకు కూడా మంచి ఆదరణ లభించింది. ఈ నేపథ్యంలో 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీలో 'భాగ్యం' అనే గృహిణి పాత్రలో ఐశ్వర్య అదరగొట్టడంతో టాలీవుడ్ దర్శక నిర్మాతలు ఆమెకు అవకాశాలిచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆమె భాగ్యనగరిలోనే స్థిరపడాలని భావిస్తున్నారు. కాగా ఐశ్వర్యకు తెలుగు సీనియర్ నటి శ్రీలక్ష్మి మేనత్త కావడం గమనార్హం.

కార్తి 'వా వాత్తియార్' ఫస్ట్ సింగిల్ రిలీజ్

తమిళ చిత్రజ్యోతి

కార్తి , కృతిశెట్టి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'వా వాత్తియార్'. ఈ మూవీ తొలి సింగిల్‌ను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం రిలీజ్ చేశారు. 'ఉయిర్ పత్తిక్కాం...' అంటూ సాగే ఈ పాట లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కార్తి, కృతిశెట్టితో పాటు సత్యరాజ్, రాజ్‌కిరణ్, జీఎం సుందర్ తదితరులు నటించారు. స్టూడియో గ్రీన్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఇప్పటికే ఈ మూవీ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ఇందులో మొత్తం ఐదు పాటలుండగా, ప్రముఖ గేయరచయిత వివేక్ సాహిత్యాన్ని అందించారు. తమిళ చిత్రపరిశ్రమలో ట్రెండ్ సెట్టర్‌గా ఉన్న సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ ఈ మూవీకి అద్భుత సంగీతాన్ని అందించారని, పాటలన్నీ ఆదరణ పొందుతాయని దర్శకుడు నలన్ కుమారస్వామి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



'వా వాత్తియార్'లో కార్తి - కృతిశెట్టి

థ్రిల్లర్ స్టోరీలో అరి అర్జునన్



మనో క్రియేషన్స్ పతాకంపై ఏ.రాజా నిర్మాణంలో అరి అర్జునన్ కథానాయకుడుగా థ్రిల్లర్ స్టోరీతో ఒక చిత్రం రూపొందుతోంది. ఇందులో దీక్షిక, పవిత్ర, 'తలైవాసల్' విజయ్, ఆదిత్య కదిర్ తదితరులు నటిస్తున్నారు. ఇప్పటివరకే షూటింగ్ పూర్తి చేసుకోగా, పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటుంది. ఈ సినిమాకు 'కేజీ ప్లానర్' అనే టైటిల్ ఖరారు చేసి హీరో అరి అర్జునన్ పుట్టిన రోజు సందర్భంగా ప్రకటించారు. ఎంతో ఆసక్తికరంగా సాగే ఈ థ్రిల్లర్ స్టోరీ సాగనుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్ త్వరలోనే విడుదలకానుంది. ఏఎల్.సుందరపాండి కథ సమకూర్చి దర్శకత్వం వహించారు.

'గ్యాంగర్స్'లో ఐదు గెటప్‌ల్లో వడివేలు

ప్రముఖ హాస్య నటుడు వడివేలు సుదీర్ఘకాలం తర్వాత సుందర్.సి దర్శకత్వంలో నటించారు. ఈ చిత్రానికి 'గ్యాంగర్స్' అనే టైటిల్ ఖరారు చేశారు. బెంజ్ మీడియా పతాకంపై ఏసీఎస్ అరుణ్ కుమార్ సమర్పణలో ఈ మూవీ తెరకెక్కుతుంది. ఇందులో హీరోయిన్‌గా కేథరిన్ థెరిసా, హరీష్ పేరడి, మైమ్ గోపి, మునీష్ కాంత్, బక్స్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ఇందులో ప్రముఖ హాస్య నటుడు వడివేలు ఏకంగా ఐదు గెటప్‌ల్లో కనిపించనున్నారు. వీటిలో ప్రధానంగా మహిళ వేషంలో చాలాకాలం తర్వాత వడివేలు కనిపించనున్నారు. ఈ పాత్ర ఎంతో బాగా వచ్చిందని, ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుందని మేకర్స్ అంటున్నారు.



'గ్యాంగర్స్'లో వడివేలు, సుందర్



కొరట్టూరుపై 'చిరోనోమస్' దండయాత్ర

- కీటకాలపై అధికారుల వినూత్న పోరు

'చిరోనోమస్' కీటకం

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరుపై 'చిరోనోమస్' కీటకాలు దండయాత్ర చేస్తున్నాయి. ఐదువందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొరట్టూరు చెరువే ఇందుకు కారణంగా మారింది. సమీప ప్రాంతాల్లో భూగర్భజలాల పరిమాణాన్ని పెంచి, పరిసరాల్లో నివసించేవారికి మంచినీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటైన ఈ చెరువు.. అందుకు భిన్నంగా కీటకాలకు నెలవుగా మారి వ్యాధులను వ్యాపింపజేయడం శోచనీయం. ఆ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ సదుపాయం లేకపోవటంతో ఇళ్ళనుండి వచ్చే మురుగునీరు, సమీప ప్రాంతాల్లోని కర్మాగారాల నుంచి వచ్చే కాలుష్య పదార్థాలు, వ్యర్థాలతో నిండి మంచినీటి సరస్సులా ఉండాల్సిన చెరువు కాస్త ఓ మినీ కూపంగా మారింది. దుర్గంధం వ్యాపించే కొరట్టూరు చెరువు గత పదేళ్లుగా 'చిరోనోమస్' అనే కీటకాలకు స్థావరంగా మారింది. రాత్రవగానే చెరువు చుట్టూ ఉన్న ఇళ్లల్లో దీపాలు వెలిగిస్తే, విద్యుత్ దీపాలను ఆన్ చేస్తే చాలు వేల సంఖ్యలో కీటకాలు స్థానికులపై దండయాత్ర చేస్తున్నాయి. 2014లో తొలిసారిగా ఆ చెరువు చుట్టూ నివసిస్తున్నవారు ఆ 'చిరోనోమస్' దండయాత్ర రుచి చూశారు. ఆ కీటకాల వల్ల స్థానికులు అనారోగ్యం పాలయ్యారు. ఆ విషయం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్ళింది. అప్పట్లో ఏవో మందులను ఆ చెరువు చుట్టూ పిచికారీ చేసి ఆ కీటకాల బెడద కాస్త తగ్గించారు. ఆ చెరువులోని కీటకాలను నాశనం చేయడానికి అధికారులు 300లకు పైగా బాతులను విడిచిపెట్టారు. ఆ కీటకాల వల్లనో లేక చెరువులోని మురుగునీటి వల్లనో ఆ బాతులు కొద్ది రోజులకే మాయమయ్యాయి. ప్రతియేటా ఆగస్టు నుండి ఫిబ్రవరి దాకా ఈ కీటకాలు పరిసర ప్రాంతాల్లోని ఇళ్ళపై దండయాత్ర చేయడం ఆనవాయితీగా మారింది.



కొరట్టూరు చెరువు వద్ద వేస్ట్ ఆయిల్‌తో తడిపిన వస్త్రం కడుతున్న కార్పొరేషన్ సిబ్బంది

SUNDAY SPECIAL



ఆయిల్ తడిపిన వస్త్రానికి తగులుకున్న కీటకాలను చూస్తున్న ఎంటోమాల జిస్ట్



కీటకాలను ఆహ్వానిస్తున్న ఫ్లడ్ లైట్లు

కీటకాలపై ఎదురుదాడి

జనవరిలో స్థానికులు ఆ చెరువులో మళ్ళీ 'చిరోనోమస్' కీటకాల బెడద అధికమైనట్లు కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కార్పొరేషన్‌లోని కీటకాల శాస్త్రనిపుణులు రంగంలోకి దిగి ఆ చెరువు చుట్టూ 50 ప్రాంతాల్లో వేస్ట్ ఆయిల్‌లో తడిపిన తెల్లటి వస్త్రాలను తెరచాపలా కట్టారు. ఆ వస్త్రాలపై కాంతి పడేలా ఫోకస్ ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. రోజూ సాయంత్రం ఆ చెరువు నుండి ఎగురుతూ వచ్చే ఆ కీటకాలు ఆయిల్‌తో తడిసిన ఈ వస్త్రాలపై వాలటం, అప్పటికే ఆ ప్రాంతాల్లో సిద్ధంగా ఉన్న పారిశుధ్య కార్మికులు బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ మిశ్రమాన్ని ఆ వస్త్రాలపై పిచికారీ చేయటం వంటివాటితో రోజూ పోరాటం చేస్తున్నారు. ఆదే విధంగా చెరువుచుట్టూ ఉన్న ఇళ్ల వద్ద ఆ కీటకాలను గుర్తించే పది యంత్ర పరికరాలను కూడా ఉంచారు. ఇంత చేసినా కీటకాల బెడద యాభై శాతం కూడా తగ్గలేదు.

మరిన్ని చర్యలు ప్లీజ్!

శీతాకాలం వచ్చిందంటే చాలు చెరువులోని కీటకాలన్నీ గుంపుగుంపులుగా ఇళ్లలోకి చొరబడి దాడికి దిగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ కీటకాల బెడద అధికమైనప్పుడల్లా కార్పొరేషన్ అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటున్నా వాటిని పూర్తిగా నాశనం చేయలేకపోతున్నారని తెలిపారు. గత 20 రోజులకు పైగా ఈ కీటకాల బెడద వల్ల సాయంత్రం వేళ ద్విచక్రవాహనాలపై వెళ్లేందుకు కూడా స్థానికులు తటపటాయిస్తున్నారు. ఈ కీటకాలు ఆయుష్షు మూడు నుండి ఐదు రోజులే అయినా వీటివల్ల కలిగే ఇబ్బంది మాత్రం అధికమని, రాత్రిపూట ఇళ్లలో లైట్లు వేసుకోలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఈ చెరువులోని మురుగునీటిని, కాలుష్య పదార్థాలను తొలగించి లోతు పెంచితే ఈ కీటకాల బెడద శాశ్వతంగా తొలగుతుందని తెలిపారు. ఈ దిశగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌కు డాక్టరేట్



ఛాన్సలర్ విశ్వనాథన్ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న జేవియర్స్ వర్సిటీ నిర్వాహకులు

వేలూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాకు చెందిన సెయింట్ జేవియర్స్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో వీఐటీ యూనివర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. కోల్‌కతా న్యూ టౌన్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం సెయింట్ జేవియర్స్ యూనివర్శిటీ 6వ స్నాతకోత్సవం జరిగింది. కార్యక్రమానికి జేవియర్స్ వర్సిటీ ఛాన్సలర్ రెవ.డా.జేమ్స్ అర్హెన్ తేటి, వైస్ ఛాన్సలర్ రెవ.డా.జాన్‌ఫెలిక్స్ రాజ్ నేతృత్వం వహించగా, ముఖ్యఅతిథిగా మేఘాలయ హైకోర్టు చీఫ్ జస్టిస్ పి.ముఖర్జీ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా విద్య, నాయకత్వం, సామాజిక సేవ సహా పలు రంగాల్లో భాగస్వామ్యులైన వీఐటీ వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ సెయింట్ జేవియర్స్ యూనివర్శిటీతో తమకు అనుబంధం ఉందన్నారు. నాణ్యమైన విద్య, పరిశోధనలో దేశం అగ్రగామిగా నిలిచేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్లు శంకర్ విశ్వనాథన్, డా.శేఖర్ విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ డా.కాంచన భాస్కరన్, ప్రొ వైస్ ఛాన్సలర్ డా.పార్థసారథి మల్లిక్, డైరెక్టర్ డా.ఎలిజబెత్ రూఫస్, ఫాదర్ డొమినిక్ గోమ్స్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

లా వర్సిటీ ఈసీ సభ్యుడిగా దివ్యాంగ ప్రొఫెసర్



ప్రొఫెసర్ ఏలుమలై

పెరంబూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): న్యాయ శాఖ చరిత్రలో తొలిసారి తమిళనాడు జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా దివ్యాంగుడైన ప్రొఫెసర్ ఏలుమలై నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం తిరుచ్చి కేంద్రంగా పనిచేస్తుందన్నారు. ఈ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా దివ్యాంగులైన ప్రొఫెసర్ ఎస్.ఏలుమలై నియమితులయ్యారని తెలిపింది. జాతీయ న్యాయ విద్య చరిత్రలో తొలిసారి ఒక దివ్యాంగుడైన ప్రొఫెసర్ నియమితులు కావడం గర్వించదగ్గ విషయమని తెలిపింది. నియమాక ఉత్తర్వులు తమిళనాడు జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ ఛాన్సలర్, మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ జారీచేశారని తెలిపింది. ప్రస్తుతం నియమితులైన ప్రొఫెసర్ ఏలుమలై తమిళనాడు అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయంలోని మానవ హక్కుల న్యాయ శాఖాధిపతిగా పనిచేస్తున్నారని తెలిపింది. ఆయన 2021లో రాష్ట్రపతి నుంచి ఉత్తమ ప్రొఫెసర్‌గా జాతీయ అవార్డు, 2012లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తర ప్రొఫెసర్‌గా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారని వర్సిటీ తెలిపింది.

- థైపూస ఉత్సవాలు..

పళని హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు



హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు

టీనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో సుప్రసిద్ధ శైవ క్షేత్రం పళని దండాయుధపాణి స్వామివారి హుండీ ఆదాయం రూ.3.31కోట్లు వచ్చినట్లుట అధికారులు తెలిపారు. ఆలయంలో జరిగిన థైపూస ఉత్సవాల్లో భక్తులు హుండీల్లో వేసిన నగదు, బంగారం కానుకల లెక్కింపు శనివారం ఉదయం జరిగింది. ఆలయ ఉద్యోగులు, పళనియాండవర్ ఆర్ట్స్ సైన్స్ కాలేజీ ఉద్యోగులు, విద్యార్థులు హుండీ కానులను లెక్కించారు. వాటిలో 557 గ్రాముల బంగారం, 21 కేజీల వెండి, విదేశీ కరెన్సీ లభించాయి. వీటితోపాటు నగదు కూడా కలిపి రూ.3.31 కోట్లు దాటిందని ఆలయ అధికారులు తెలిపారు.

'ఎర్నెట్' తో కేసీజీ అవగాహన ఒప్పందం

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): హిందూస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అనుబంధంగా ఉన్న కేసీజీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు చెందిన ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నెట్‌వర్క్ (ఎర్నెట్) ఇండియాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కీలకమైన సాంకేతిక డొమైన్‌లో పరిశోధన, శిక్షణలో సహకారం అందించటమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆన్నీ జేకబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్నెట్ ఇండియా డైరెక్టర్ జనరల్ సంజీవ్ బంజాల్, హిందూస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎలిడ్ వర్గీస్ జేకబ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ముత్తుకృష్ణన్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పాండేన్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో ఎర్నెట్ సంస్థ, కేసీజీ కళాశాల నిర్వాహకులు తదితరులు



కొళత్తూరు చెరువు శుద్ధీకరణపై మంత్రి శేఖర్‌బాబుకు వివరిస్తున్న అధికారులు

చెరువుల పునరుద్ధరణకు చర్యలు

- మంత్రి పీకే శేఖర్‌బాబు


ప్యారీస్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం, శివారు ప్రాంతాల్లో వున్న చెరువుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నట్లు హిందూ దేవాదాయ శాఖామంత్రి, సీఎండీఏ ఛైర్మెన్ పీకే శేఖర్‌బాబు తెలిపారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గంలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద చెన్నై మెట్రోపాలిటన్ డెవలెప్మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆధ్వర్యంలో పునరుద్ధరించనున్న చెరువులు, పార్కులను శనివారం ఉదయం వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి శేఖర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కొళత్తూరు చెరువు గట్టుపై నివసిస్తున్న 81 కుటుంబాలకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో సీఎండీఏ తరుపున అనేక అభివృద్ధి పథకాలను పూర్తిచేశామన్నారు. ఇదే క్రమంలో చెరువుల శుద్ధీకరించి, లోతు పెంచడంతో పాటు నీటి నిల్వలను పెంచేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. చెరువు ప్రాంతాలను సుందరీకరణ చేసి ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికులు వ్యాయామ శిక్షణలో పాల్గొనే విధంగా వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఆదేవిధంగా విద్యార్థులకు వినోదం పంచేవిధంగా పార్కులను డిజైన్ చేయనున్నట్లు వివరించారు. సీఎం ఉత్తర్వుల మేరకు నగర శివారు ప్రాంతాల్లోని 13 చెరువులను రూ.250కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే కొళత్తూరు చెరువును పునరుద్ధరించి నీటి సామర్థ్యాన్ని పెంచే పనులు డిసెంబరు నాటికి పూర్తిచేయనున్నట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు హౌసింగ్ బోర్డ్, నగరాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉషా, సీఎండీఏ ప్రిన్సిపల్ అధికారి శివజ్ఞానం, టౌన్ ప్లానింగ్ సంస్థ డైరెక్టర్ గణేశన్, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిద్ధార్థ్, నగర మేయర్ ప్రియ సహా అధికారులు పాల్గొన్నారు.

విడుదల కాని నిధులు

జాప్యం అవుతున్న కేంద్ర పథకాలు

- 'దిశ' సమావేశంలో స్టాలిన్

చెన్నై,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం వల్లే జిల్లాల వారీగా కేంద్ర పథకాలను అమలు చేయడంలో జాప్యం ఏర్పడుతోందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. సచివాలయంలో శనివారం ఉదయం 'దిశ' (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) నాలుగో విడత సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలితాలు మారుమూల గ్రామాల ప్రజలకు కూడా లభించేలా ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించినంతవరకు రాష్ట్ర ప్రభుత్వ వాటాను సకాలంలో కొన్ని సమయాల్లో నిర్ణీత గడువు కంటే ముందుగానే చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఇదే విధంగా తొల్ తిరుమావళవన్ సూచన ప్రకారం పీఎం ఆవాస్ యోజన ప్రాజెక్టు కింద నిర్మించే ఇళ్లకు సబ్సిడీ మొత్తాన్ని పెంచాలన్న ప్రతిపాదాన కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు పంపుతున్నట్లు తెలిపారు. మరిన్ని కేంద్ర పథకాల గురించి సమగ్రంగా చర్చించి ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు స్టాలిన్ చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు పెరియసామి, ఎం.సుబ్రమణ్యం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేడీ, ఎండీఎంకే నేత దురై వైగో, వీసీకే నేత తొల్ తిరుమావళవన్, ఎంపీ టీఆర్‌బాలు తదితర రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చేరువగా సెంగోటయ్యన్...

ఈ సమావేశంలో అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సెంగోట్టయన్ చురుకుగా పాల్గొనటం అన్ని పార్టీల నేతలు, ప్రతినిధులను విస్మయపరచింది. రాష్ట్ర అభివృద్ధి, సమన్వయకమిటీలో ఆయన సభ్యుడిగా ఉన్నప్పటికీ దిశ సమావేశాలకు హాజరయ్యేవారు కాదు. అయితే శనివారం జరిగిన ఈ సమావేశంలో పాలకపక్షం డీఎంకే సభ్యులకు సమీపంగా సెంగోట్టయన్ కూర్చునా న్నరు.అది కూడా డీఎంకే కోశాధికారి, ఎంపీ టీఆర్‌బాలు వెనుకసీటులో కూర్చున్నా రు.ఈ విషయాన్ని గమనించిన స్టాలిన్ తన ప్రసంగంలో సెంగోటయ్యన్ ప్రతిపాదన మేరకు కొబ్బరి రైతులకు చెల్లించాల్సి నగదును వీలైనంత త్వరగా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.

'సూర్యకాంతం నటనలో నవరసాలు'

- రేపు హిందూ కళాశాలలో జాతీయ సదస్సు

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరాంలోని ధర్మమూర్తి రావుబహదూర్ కలవల కణ్ణన్‌చెట్టి హిందూ కళాశాలలో సోమవారం 'సూర్యకాంతం నటనా వైదుష్యంలో నవరసాలు' అనే అంశంపై జాతీయ సదస్సు జరుగనుంది. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి-యువ సంయుక్త నిర్వహణలో జరుగనున్న ప్రారంభోత్సవ సభకు కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ ముద్దులూరు సురేశ్ స్వాగతం పలుకనుండగా, ప్రధానధ్యాపకులు డాక్టర్ జి.కల్విక్కరసి అధ్యక్షోపన్యాసం చేయనున్నారు. తెలుగుశాఖ సహాయాచార్యులు డాక్టర్ తుమ్మపూడి కల్పన అతిథులను పరిచయం చేయనున్నారు. ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారులు మాధవపెద్ది మూర్తి, దివంగత నటి సూర్యకాంతం కుమారుడు డాక్టర్ అనంత పద్మనాభమూర్తి ముఖ్య అతిథులుగా హాజరుకానుండగా, ద్రవిడ విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు ఆచార్య జేవీ సత్యవాణి కీలకోపన్యాసం చేయనున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సదస్సు మొదటి సమావేశంలో 'నవరసాలు-సూర్యకాంతం నటన' అనే అంశంపై మాధవపెద్ది మూర్తి, ప్రముఖ రచయిత చిత్రాపూరి మదన్ మోహన్, ట్రిబ్యునల్ జడ్జి జయచంద్ర ప్రసంగించనున్నారు. 12 గంటలకు జరుగనున్న రెండో సమావేశంలో 'సూర్యకాంత నటనా వైదుష్యం-నవరస భరితం' అనే అంశంపై ప్రముఖ రచయిత్రి జలంధర, ప్రముఖ హాస్య రచయిత్రి జోస్యుల ఉమ ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమాపనోత్సవ సభలో ఎస్వీ రామారావు రూపొందించిన 'అత్తగారూ జిందాబాద్' డాక్యుమెంటరీ ప్రదర్శన, హిందూ కళాశాల తెలుగు విద్యార్థులు రూపొందించిన 'వెండితెర వెన్నెల సూర్యకాంతం' శబ్దచిత్ర ప్రదర్శన వుంటుంది. ఎం.వెంకటేశ పెరుమాళ్ అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీనటి రోజా రమణి, విశిష్ట అతిథిగా ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, గౌరవ అతిథిగా అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షులు డాక్టర్ అజంతా కె.శంకరరావు, ఆత్మీయ అతిథిగా హిందూ కళాశాల సంచాలకులు డాక్టర్ ఎస్.రాజేంద్రనాయుడు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

శేషాచల కొండకోనల్లో, సముద్రం,
శ్రీగంధం పుస్తకాలా విష్కరణ



శ్రీసిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో శనివారం శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. పర్వతారోహకుడు, రచయిత భూమన్ రచించిన 'శేషాచల కొండకోనల్లో' పుస్తకాన్ని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, డాక్టర్ కనుపూరు శ్రీనివాసులురెడ్డి రచించిన సముద్రం, శ్రీగంధం కథా సంపుటాలను రవీంద్ర సన్నారెడ్డి, సన్నారెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. రచయిత భూమన్ తన స్వీయ అనుభవంతో శేషాచల కొండల అందం, ఆధ్యాత్మిక సారాన్ని వివరిస్తూ 'శేషాచల కొండల్లో' పుస్తకాన్ని తీర్చిదిద్దారు. రైతులు, స్త్రీలు, మానవ సంబంధిత అంశాలను స్పృశిస్తూ చిన్న చిన్న కథా సంపుటాలను రచయిత శ్రీనివాసులురెడ్డి సముద్రం, శ్రీగంధం పుస్తకాలలో పొందుపరిచారు. శ్రీసిటీలో విజ్ఞానం, సాంస్కృతిక వృద్ధిని పెంపొందించాలనే రవీంద్ర సన్నారెడ్డి దృష్టికిసరితూగే రీతిలో ప్రకృతి, మానవ సంబంధాలను స్పృశించే అంశాలతో తన పుస్తక సారాంశం ముడిపడి ఉందని భూమన్ వివరించారు. కథ అంటే కేవలం పదాల సమాహారమే కాదు జీవిత ప్రతిరూపమని మరో రచయిత కనుపూరు శ్రీనివాసులురెడ్డి వ్యాఖ్యానించారు. రచనల సాహిత్య ప్రాముఖ్యత, కథన శైలి, ఇతివృత్త సంపన్నతపై ప్రముఖ రచయితలు, సమీక్షకులు ఆర్ఎం ఉమామహేశ్వరరావు, పేటశ్రీ, జింకా నాగరాజు, డాక్టర్ పెళ్ళూరు జయప్రద, డాక్టర్ పెరుగు రామకృష్ణ తమ అవగాహన దృక్పథాన్ని పంచుకున్నారు. సమకాలీన తెలుగు సాహిత్యంపై పుస్తకాల ప్రభావం, రచయితల విలక్షణమైన కథా కథన శైలి, కథనాలలోని భావోద్వేగం, తాత్విక సమ్మేళనం, నేటి సమాజంలో ఇతివృత్తాల ప్రాముఖ్యతను వివరించారు. శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ మాజీ వీసీ పి.కుసుమకుమారి ప్రసంగించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.70 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,527

తలనీలాలు సమర్పించినవారు: 23,129


పదజాలం, వ్యాకరణాంశాలపై సాధన

తెలుగులో అవగాహన- ప్రతిస్పందనకు 32 మార్కులుంటాయి. గద్యభాగం ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఉపవాచకం నుంచి ఇచ్చే 4 వాక్యాలను ఏ కాండలకు చెందినవో గుర్తించి పూర్తి వాక్యరూపంలో రాయాలి. అపరిచిత గద్యం, లేఖ, సంభాషణ తదితర రూపంలో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు ఇదేలాగా రాయాలి. 2వ విభాగంలో వ్యక్తీకరణ- సృజనాత్మకతకు 36 మార్కులు ఉంటాయి. పద్యభాగం నుంచి కవిపరిచయం, వ్యాసరూప ప్రశ్నలు, గద్యభాగంలో ప్రక్రియ లేదా నేపథ్యం అడుగుతారు. రామాయణంలో ఒక పాత్రస్వభావం వివరించాలి. మూడవ విభాగంలో పద్య, గద్య భాగాల్లోని భాషాంశాలు, పదజాలం, వ్యాకరణాంశాలు, పదవిజ్ఞానం అడుగుతారు.



- యువశ్రీ మురళి, తెలుగు ఉపాధ్యాయుడు, జడ్పీహైస్కూల్, కల్లిపెట్టు, బి.ఎన్.కండ్రిగ మండలం.

విద్యార్థి జీవితానికి పదవ తరగతి కీలక మలుపు. ఉన్నత విద్యకు... ఆపై బంగారు భవిష్యత్తుకు ఇది పునాది. ఈ పునాది బలంగా ఉండాలంటే... ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలంటే పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలి. ప్రణాళిక ప్రకారం చదువుతూ... కొన్ని మెళకువలను పాటిస్తూ.. సమయ పాలనతో చదివితే ఇదేమంత కష్టం కాదంటున్నారు నిపుణులైన ఉపాధ్యాయులు. మార్చి 17నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు ప్రిపరేషన్ కోసం వారి విలువైన సూచనలివి. - తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



ఇలా ప్రిపేరయితే టెన్షన్ ఉండదు



ఆసక్తి ఉంటే ఆంగ్లంలో అధిక మార్కులు

ఆసక్తి చూపితే ఆంగ్లంలో అధిక మార్కులు సాధించవచ్చు. ఈ ఏడాది ప్రశ్నపత్రం మార్పులను గుర్తించి సాధన చేయాలి. డైరెక్ట్ అండ్ ఇండైరెక్ట్ స్పీచ్, ఎడిటింగ్ ప్యాసేజ్/ఎర్రర్ కరెక్షన్, టు, ఉడ్ ఉపయోగించి రాయడంపై అవగాహన పెంచుకోవాలి. డిస్క్రిప్టివ్ రైటింగ్, ట్రిప్ట్ ఫర్ స్పీచ్‌లో రచనా నైపుణ్యాన్ని సాధించాలి. వెనుకబడిన విద్యార్థులు మంచి మార్కులు సాధించాలంటే కాంప్రెహెన్షన్, స్టడీ సర్కిల్, జంబుల్డ్ సెంటెన్స్‌ను వరుస క్రమంలో రాయడం, గ్రామర్‌లో రిలేటివ్ క్లాస్, ఇచ్చిన రెండు వాక్యాలను కలపడం, ప్రిపోసిజషన్స్, ఆర్టికల్, గివింగ్ అడ్వైజ్/సజెషన్, వకాబులరీ, డిక్షనరీ స్కిల్స్, క్రియేటివ్ రైటింగ్‌లో డైరీ ఎంట్రీ, లెటర్ రైటింగ్ అంశాలపై కొంత పట్టు అవసరం.



- కె.భాస్కర్, స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం), తొండమనాడు, శ్రీకాళహస్తి మండలం.

అవగాహనతో అత్యధిక మార్కులు



హిందీలో సులభంగా ఎక్కువ మార్కులు సాధించవచ్చు. సెక్షన్-1లో 12 బిచ్చిక వ్యాకరణ సంబంధ ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-2లో 9, 10 పాఠాల నుంచి పఠిత గద్యాంశంలో ఐదు మార్కులకు ఐదు ప్రశ్నలు. 3, 5 పాఠాల నుంచి పఠిత పద్యాంశంపై 5 ప్రశ్నలు ఇస్తారు. అపఠిత గద్య, పద్య పేరాల నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-3లో ఓ ప్రాచీన కవి లేదా నవీన కవి పరిచయంపై ఐదు మార్కులుంటాయి. పరిచయ పేరాను చదివి ఖాళీలు పూరిస్తే ఐదు మార్కులు పొందొచ్చు. పాఠాల చివరనున్న ప్రశ్నలకు జవాబులు బాగా చదివి సెక్షన్ 4లో ఇచ్చే 8 ప్రశ్నల్లో 6 ప్రశ్నలకు 5-6 వాక్యాల్లో జవాబులు రాస్తే 24 మార్కులు సాధించవచ్చు.

- ఎస్.మల్లేశ్వరి, స్కూల్ అసిసెంట్, ఎస్పీజడ్పీ బాలికల పాఠశాల, చంద్రగిరి.

మ్యాపు నైపుణ్యాలపై పట్టు



సాంఘిక శాస్త్రంలో మ్యాప్ నైపుణ్యాలపై పట్టు అవసరం. ప్రపంచ పటం, భారతదేశ పటాన్ని బాగా గుర్తుంచుకోవాలి. పట్టికలు, గ్రాఫ్‌లు విశ్లేషించమనే అవకాశం ఉంటుంది. వినియోగదారులు అవగాహన పెంచుకోడానికి నినాదాలు, ప్రజాస్వామ్యం విజయవంతమయ్యేందుకు సూచనలు వంటి ప్రశ్నలు ఉంటాయి. సమకాలీన అంశాలపై ప్రతిస్పందనలు, ప్రశ్నించడం, విద్యాప్రమాణాలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరక్షరాస్యత, ఆదాయ అసమానతలు అంశాలపై ప్రశ్నలు వస్తాయి.

- కె.సురేష్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీహైస్కూల్, ఊరందూరు, శ్రీకాళహస్తి మండలం

ఎక్కువ మార్కులు స్కోర్ చేయొచ్చు

జీవశాస్త్రం మొదటి అధ్యాయంలో లైఫ్ ప్రాసెస్ (జీవక్రియలు), జీవుల్లో ప్రత్యుత్పత్తి, అనువంశికత అనే యూనిట్‌ను బాగా చదువుకోవాలి. వ్యాసరూప ప్రశ్నలు ఎక్కువగా వస్తాయి. మానవ విసర్జక వ్యవస్థ, పుష్ప నిర్మాణం, స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, మానవునిలో లింగనిర్ధయం, నెఫ్రాన్, న్యూరాన్, మెదడు నిర్మాణం చిత్రాలను బాగా సాధన చేయాలి. కిరణజన్య సంయోగ క్రియకు కార్బన్ డైఆక్సైడ్ అవసరం, పిండి పదార్థంపై లాలాజలచర్య, రైజోపస్ ప్రయోగాలను గురించి వివరంగా నేర్చుకోవాలి. పట్టికలు, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి.



- పి.నీలకంఠయ్య, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీ హైస్కూల్, కరకంబాడి

సాధనతో సాధ్యం

మాథ్స్‌లో సెక్షన్-1లో 12, సెక్షన్-2 లో 16, సెక్షన్-3లో 32, సెక్షన్-4లో 40 మార్కులకు పేపర్ ఉంటుంది. సంభావ్యత చాప్టర్‌లోని అన్ని సమస్యలపై ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లను పరిశీలించి సమాధానాలు రాయాలి. సాంఖ్యక శాస్త్రంలో వర్గీకృత దత్తాంశానికి సగటు, మధ్యగతం, బాహుళకాన్ని గుర్తించాలి. రెండు చర రాసుల్లో రేఖీయ సమీకరణాల జతలో గ్రాఫ్ ద్వారా సాధన, చతురస్ర శీర్షాలను చూపండి వంటి 8 మార్కుల ప్రశ్నలపై సాధన చేయాలి. వర్గసమీకరణాలు, అంకశ్రేఢులు, త్రికోణమితి పరిచయం, వృత్తాలు, ఉపరితల వైశాల్యాలు, ఘన పరిమాణాలు చాప్టర్లలో పట్టు అవసరం. వర్గీకృత దత్తాంశానికి సగటు, మధ్యగతము, బాహుళకాన్ని గుర్తించి సూత్రాన్ని రాసి పదాలను వివరించాలి.



- ఎం.పూర్ణచంద్రారెడ్డి, జడ్పీ హైస్కూల్, తడకు ఆర్ఎస్.

బ్లూప్రింట్, మాదిరి ప్రశ్నపత్రాలు కీలకం

జనరల్ సైన్స్ ప్రశ్నపత్రం నాలుగు సెక్షన్లుగా ఉంటుంది. సెక్షన్-1లో 1 మార్కు ప్రశ్నలు 8, 2వ సెక్షన్లో 2 మార్కుల ప్రశ్నలు 3, 3వ సెక్షన్లో 4 మార్కుల ప్రశ్నలు 3, 4వ సెక్షన్లో 8 మార్కుల ప్రశ్నలు మూడింటికి సమాధానాలు రాయాలి. రసాయన చర్యలు - రకాలు, వాటి ఉదాహరణలు, సమీకరణలు, తుల్యం చేయడం, లవణాలు-ఫార్ములాలు, లవణాలు- పయోగాలు, ఆమ్లాల ధర్మాలు- కృత్యాలు, పట సహాయంతో కృత్యాల వివరణ, లోహాలు-ధర్మాలు, లోహాల చర్యాశీలత ఆధారిత కృత్యాలు, హైడ్రోకార్బన్‌లు-రకాలు, ఫార్ములాలు, ధర్మాలు, సంకలన చర్యలు, ప్రతిక్షేపణ చర్యలు, దర్పణాలు-కటకాల భేదాలు, కిరణ చిత్రాలు గీయడం, దర్పణ సూత్రం ఆధారిత సమస్యలు హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి సమస్యలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో సాధనచేయాలి.



- పి.శైలేందర్‌రెడ్డి, ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయుడు, జడ్పీహైస్కూల్, కుప్పం బాదూరు



టీటీడీ పరిపాలనా భవనం ముందు నిరసన తెలుపుతున్న చింతా మోహన్

అన్యమతస్థుల పేరుతో క్రైస్తవులను 'కొండ' దించడం రాజ్యాంగ విరుద్ధం

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అన్యమతస్థుల పేరుతో కొండపై ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న క్రైస్తవులను కిందకు దించేందుకు టీటీడీ, ప్రభుత్వం ప్రయత్నించడం రాజ్యాంగ విరుద్ధమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. పేరుతో కొండపై పనిచేసే 4,500 మంది కార్మికులను దించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయమై తిరుపతిలోని టీటీడీ పరిపాలనా వద్ద శనివారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన చేపట్టారు. బ్రిటీష్ పాలనలో తిరుచానూరులో ఓ దళితుడు ఆలయ ప్రవేశం చేశాడని జైల్లో పెట్టారని తెలుసుకున్న మహాత్మాగాంధీ, రాజగోపాలాచారి తిరుమలకు చేరుకొని పోరాటం చేసి 33 మంది దళితులకు ఆలయ ప్రవేశం కల్పించిన విషయాన్ని గ్రహించాలన్నారు. కుల, మత వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా దళితులకు ఆలయ ప్రవేశం కల్పించడమే సనాతన ధర్మం అనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. టీటీడీ ఉద్యోగులకు, అర్చకులకు అడవుల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసి, అలిపిరి నుంచి పేరూరు వరకు ఖాళీగా ఉన్న 400 ఎకరాల టీటీడీ భూముల్లో 5 సెంట్ల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీ గౌడ్, రవి, తేజోవతి, రావణ్, మునిశోభ, వెంకటేష్‌గౌడ్, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తుడా బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌కు విశేష స్పందన

తిరుపతి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)ఆధ్వర్యంలో నిర్వహించిన బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌కు మేళాకు విశేష స్పందన లభించిందని తుడా వీసీ ఎస్.మౌర్య తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె అధికారులతో సమావేశమై సమీక్షించారు. 2020లో తుడా నిర్వహించిన మేళాలో ఎల్ఆర్ఎస్‌కి సంబంధించి 3363 దరఖాస్తులు పెండింగ్ ఉండగా 2394 దరఖాస్తులు క్లియర్ చేశామన్నారు. 423 దరఖాస్తులకు సరైన పత్రాలు, డ్రాయింగ్ ఇవ్వనందువల్ల షార్ట్‌ఫాల్ పెట్టామన్నారు. 2019లో బీపీఎస్ కింద 51 దరఖాస్తులు ఉండగా పదింటికి అనుమతులు ఇచ్చామన్నారు. పత్రాలు, డ్రాయింగ్ సక్రమంగా లేని 28 దరఖాస్తులు షార్ట్ ఫాల్ పెట్టామని వివరించారు. వీటిని పరిష్కరించేందుకు ఇంటింటికి వెళ్ళి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అంతవరకు దరఖాస్తుదారులు వేచిచూడకుండా, తుడా కార్యాలయానికి వచ్చి మార్చి నెలాఖరులోపు పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ మూడు రోజులపాటు నిర్వహించిన మేళాలో సుమారు వందమంది నేరుగా వచ్చి దరఖాస్తులు పరిష్కరించుకొన్నారన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ సన్నద్ధం



అధికారులతో సమీక్షిస్తున్న డీపీటీవో నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ యాజమాన్యం సన్నద్ధమవుతోంది. డీపీటీవో జి.నరసింహులు శనివారం డిపో మేనేజర్లతో సమీక్షించారు. శైవక్షేత్రాలకు కొరత లేకుండా సర్వీసులు నడపాలని ఆదేశించారు. పల్నాడు జిల్లాలోని కోటప్పకొండకు వంద బస్సులు తరలించాలని ఆదేశించారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో తిరుపతి, కోడూరు-తలకోన, గుడిమల్లం, శ్రీకాళహస్తి-తిరుపతి, నాయుడుపేట, గూడూరు, పిచ్చాటూరు, తడ, చెన్నై, గుడిమల్లం, పుత్తూరు-సదాశివకోన, కైలాసకోన, మూలకోన, ఊత్తుకోట-సదాశివకోన, వరదయ్యపాళెం-అవంతి, కోట, నాయుడుపేట-పంట్రంగం మార్గాలతో ప్రత్యేక సర్వీసులు నడపాలని సూచించారు. కాగా, సెంట్రల్ బస్టాండులో ప్రజా రవాణాధికారి జి.నరసింహులు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రపరిచారు.



రైతులతో డీఈ శోభామణి, సీసీవీఈసీ కోఆర్డినేటర్ సుజాత తదితరులు

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతుల్లో సీమపందుల పెంపకం అనే అంశంపై యువత, రైతులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ శనివారంతో ముగిసింది. యాజమాన్య పద్ధతులపై మెలకువలు, పోషణ, వ్యాధుల నివారణ, చికిత్స, వ్యాక్సినేషన్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, పిగ్ మాన్యూర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కోళ్ల మరణాలకు కారణమైన బర్డ్‌ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పించారు. అతిథిగా హాజరైన వర్సిటీ డీఈ ప్రొఫెసర్ డాక్టర్ శోభామణి మాట్లాడుతూ శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానంతో సీమపందుల పెంపకాన్ని చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాతతో కలసి రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.మంజరి పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ డీవై స్వామి కథనం మేరకు అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం చెరుకువారిపల్లెకు చెందిన వెంకట నాగసుబ్బయ్య (31) ఐదేళ్ల క్రితం ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద జలిజపల్లెకు చెందిన రుూన్సీని వివాహం చేసుకున్నాడు. తర్వాత కొన్నాళ్ల జీవనోపాధి కోసం కువైత్ వెళ్లొచ్చాడు. ఇదే సమయంలో ఉద్యోగ ప్రయత్నాల్లో బెంగళూరులో ఉన్న రుూన్సీని, స్వగ్రామం రావాలని ఇటీవల పిలిచాడు. ఆమె విముఖత చూపడంతో ఈనెల 10న ఎర్రావారిపాలెంలోని వెటర్నరీ ఆస్పత్రి వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు రుయాకు తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ధనంజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మొబైల్‌లో అనవసరాల జోలికి వెళ్లొద్దు

● సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో నిపుణుల సూచన



కార్యక్రమంలో పాల్గొన్న సైబర్ నిపుణులు, అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ల వాడకంలో అనవసర విషయాల జోలికి వెళ్లకపోవడం మేలని నిపుణులు సూచించారు. ఈ విషయంలో యువత కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్స్‌లోని వ్యక్తిగత సమాచారం మరొకరికి చేరకుండా జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ నేరాలపై సత్యన్న సేన ఆధ్వర్యంలో తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ సర్వర్స్ ఫౌండర్ సీతావే సాయిసతీష్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. దీనివల్ల ఎందరో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే, తొలుత అవగాహన అవసరమన్నారు. సెల్‌ఫోన్లలోని వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఫొటోలు, బ్యాంకు, ఏటీఎం కార్డుల వివరాలు, పిన్ నెంబర్లు వంటి విషయాలను గోప్యంగా ఉంచుకోవాలన్నారు. ఈ అంశాలపై సాధారణ ప్రజలకు విద్యావంతులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. హ్యాకింగ్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ కాత్యాయిని, సత్యన్న సేన అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, సభ్యులు, పోలీసు సైబర్ క్రైం విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

● సిద్ధమవుతున్న తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయ సముదాయం

అన్నీ ఒకచోటే..!

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు సంబంధించి అన్ని విభాగాలూ ఒకేచోట ఉండేలా.. తిరుపతిలోని పోలీసు పెరేడ్ మైదానంలో జిల్లా పోలీసు కార్యాలయ సముదాయం సిద్ధమవుతోంది. దాదాపు రూ.6.41 కోట్లతో జరుగుతున్న ఈ పనులను వీలైనంత త్వరలో పూర్తి చేసి సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పనులను ఎస్పీ హర్షవర్ధనరాజు శనివారం పరిశీలించారు. ఎక్కడెక్కడ ఎలాంటి నిర్మాణాలు అవసరం? పనులు నాణ్యతగా జరుగుతున్నాయా లేదా? పెయింటింగ్ బాగుందా లేదా అని స్వయంగా పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో విడుదల చేసిన రూ.85 లక్షలతో ఫర్నిచర్, ఇతర మౌలిక వసతులు కల్పించడానికి వినియోగించనున్నారు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఒక హాలు ఏర్పాటు చేస్తున్నారు. పీజీఆర్ఎస్‌కు హాలు ఏర్పాటు చేసి అక్కడ అత్యాధునిక ఫర్నిచర్ సదుపాయం కల్పించనున్నారు. ఈ పనులన్నీ రానున్న నెల రోజుల్లో పూర్తి చేసి ఏప్రిల్ మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడానికి పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

గ్రౌండు ఫ్లోర్: ఎస్పీ కార్యాలయం, సీసీ రూము, స్పెషల్ బ్రాంచ్, కాన్ఫరెన్సు హాలు, పీజీఆర్ఎస్ హాలు, ఫిర్యాదుదారులు వేచి ఉండే గది ఉంటుంది.

మొదటి అంతస్తు: అదనపు ఎస్పీలు (శాంతి భద్రతలు, పరిపాలన) చాంబర్లు, దానికి అనుకునే సీసీ గదులు ఉంటాయి. వీటితో పాటు ఏవో చాంబర్, పరిపాలనా సౌలభ్యం కోసం అన్ని విభాగాలు ఇక్కడే ఉంటాయి. అంటే ఏ సెక్షన్ నుంచి దాదాపు 12 సెక్షన్లు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

రెండో అంతస్తు: కంప్యూటర్ రూములు, క్రైం అదనపు ఎస్పీ చాంబర్,సీసీ రూము,వీడియో కాన్ఫరెన్సు హాలు, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకించి ఏసీ చాంబర్‌స్టోర్ రూము, డీసీఆర్‌బీ, డీటీఆర్‌బీ, కోర్టు మానిటరింగ్ సిస్టమ్‌కు సంబంధించిన గది ఉంటుంది.



అత్యాధునిక హంగులతో నిర్మాణం అవుతున్న జిల్లా పోలీసు కార్యాలయ కాంప్లెక్సు పనులు